www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY NEWS PAPER

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

శుక్రవారం
03-02-2023
సంపుటి - 07,
సంచిక-249
పేజీలు - 4
వెల రూ. 5/-
ఎడిటర్ : పృధ్విరాజ్. జి
9581442622

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

**తొమ్మిదేళ్లుగా కెసిఆర్ ఏం చేశారు**




2వ పేజీలో...

# పార్లమెంటులో ఆదానీ ప్రకంపనలు



## గందరగోళం మధ్య ఉభయ సభలు 2గంటల వరకు వాయిదా

ప్రతిష్టంభనపై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు ● ఉభయసభల్లో చర్చకు నోటీసులు ఇచ్చిన బిఆర్ఎస్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి2(సమసమాజం): విపక్షాల గందరగోళం మధ్య లోక్‌సభ, రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడ్డాయి. హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చకు డిమాండ్ చేస్తూ విపక్షాల గందరగోళం మధ్య లోక్‌సభ, రాజ్యసభలు మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడ్డాయి. దాంతో పాటు పార్లమెంట్ ఉభయసభల్లో బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీలు వాయిదా తీర్మానం ఇచ్చాయి. అదానీ కంపెనీలపై చర్చను చేపట్టాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు వెల్ లోకి దూసుకువెళ్లి... ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నారు. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ఇదే అంశం చర్చపై ఆందోళన కొనసాగడంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా.. రాజ్యసభ ఛైర్మెన్ ధన్‌కర్ మధ్యాహ్నం రెండు గంటల వరకు సభను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కోట్లాది మంది భారతీయుల కష్టార్జిత సొమ్మును ప్రమాదంలో పడేస్తూ మార్కెట్ విలువను కోల్పోతున్న కంపెనీల్లో ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల పెట్టుబడుల సమస్యపై చర్చించేందుకు రూల్ 267 కింద బిజినెస్ నోటీసును సస్పెండ్ చేశామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పార్లమెంటు వెలుపల అన్నారు. ఈ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ డిమాండ్ చేశారు. ప్రశ్న ఒక ప్రమోటర్ గురించి మాత్రమే కాదని, మొత్తం నియంత్రణ వ్యవస్థ యొక్క సమర్థత

3వ

# హైదరాబాద్ చేరుకున్న మహిళా క్రికెటర్లు

## విమానాశ్రయంలో ఘనంగా స్వాగతించిన మంత్రి




హైదరాబాద్,ఫిబ్రవరి2(సమసమాజం): ఇటీవల ఇంగ్లాండ్ లో జరిగిన అండర్-19 ఉమెన్స్ వరల్డ్ కప్ లో భారత జట్టు విజేతగా నిలిచింది. జట్టులో తెలంగాణకు చెందిన క్రీడాకారిణిలు జి.త్రిష, యశశ్రీ, ఫిట్ నెస్ ట్రైనర్ శాలినీ ఇంగ్లాండ్ నుంచి హైదరాబాద్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ ఎయిర్ పోర్టులో వారికి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఘన స్వాగతం పలికి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ డా. ఆంజనేయ గౌడ్, సంస్థ అధికారులు ధనలక్ష్మి, సుజాత, క్రికెట్ కోచ్ రాజశేఖర్ రెడ్డి, క్రీడాభిమానులు పాల్గొన్నారు. అండర్?19 ఉమెన్స్ వరల్డ్ కప్ విజేతగా భారత్ అవతరించింది. సౌతాఫ్రికాలో జరిగిన తొలి మహిళల ప్రపంచ కప్ ను టీమిండియా కైవసం చేసుకుంది. ఫైనల్లో ఇంగ్లాండ్ పై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్ లో తొలుత భారత బౌలర్ల ధాటికి ఇంగ్లాండ్ కేవలం 68 పరుగులకే ఆలౌట్ కాగా..ఆ తర్వాత 69 పరుగుల టార్గెట్ ను భారత్ కేవలం 14 ఓవర్లలోనే చేధించింది.

# హైదరాబాద్‌లో మరో భారీ అగ్నిప్రమాదం

## వీఎస్‌టి సమీపంలో డెకరేషన్ గోడౌన్‌లో మంటలు



మంటలను ఆర్పిన ఫైరింజన్లు

రక్షణ చర్యలు తీసుకోకుంటే చర్యలు తప్పవన్న మంత్రి

హైదరాబాద్,ఫిబ్రవరి2(సమసమాజం): చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మరో అగ్నిప్రమాదం జరిగింది. వీఎస్‌టీ లోని అన్నపూర్ణ బార్ సమీపంలో ఉన్న ఓ గోదాంలో అగ్నిప్రమాదం జరిగింది. దట్టమైన పొగలతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. విషయం తెలియగానే చిక్కడపల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మరోవైపు ఫైర్ ఇంజన్లు కూడా ఘటనాస్థలానికి

3వ

# ఢిల్లీ లిక్కర్ స్కామ్ ప్రకంపనలు



## ఛార్జ్‌షీటులో ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ పేరు

కవిత, మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్లు ■ ఇడి పనితీరుపై మండిపడ్డ కేజ్రీవాల్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి2(సమసమాజం): ఢిల్లీ లిక్కర్ స్కాం కీలక మలుపు తిరిగింది. ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జ్ షీటును పరిగణలోకి తీసుకుంటున్నట్లు రౌస్ ఎవెన్యూ కోర్టు ప్రకటించింది. ఇందులో ఢిల్లీ సీఎం కేజీవ్రాల్,ఎమ్మెల్సీ కవితతో పాటు వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సహా 17 మంది పేర్లను ప్రస్తావించింది. లిక్కర్ స్కాం ఆరోపణలు ఎదుర్కొంటున్న కవిత 10 సెల్ ఫోన్లు మార్చినట్లు ఈడీ ఛార్జ్ షీటులో ఆరోపించింది. సాక్ష్యాలు ధ్వంసం చేసిన వారిలో కవిత పేరును ప్రస్తావించింది. సౌత్ గ్రూపు నుంచి రూ.100కోట్ల లావాదేవీలు జరిగినట్లు దర్యాప్తులో గుర్తించామని స్పష్టం చేసింది. సమీర్ మహేంద్ర నుంచి విజయ్ నాయర్ భారీగా ముడుపులు అందుకోవడంతో పాటు కవిత సన్నిహితుడైన అరుణ్ పి÷-లళై సైతం భారీగా ప్రయోజనం పొందిన విషయాన్ని

3వ

# గ్రూప్-4 పరీక్ష తేదీ ప్రకటన

జులై 1వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు

హైదరాబాద్,ఫిబ్రవరి2(సమసమాజం): రాష్ట్రంలో నిర్వహించనున్న గ్రూప్-4 పరీక్ష తేదీని టీఎస్‌పీఎస్‌సీ గురువారం ప్రకటించింది. జులై 1వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. పేపర్-1 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కాగా, పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొంది. గ్రూప్-4 పరీక్షకు ఇప్పటికే 9 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రాథమికంగా నిర్ణయించారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో ఈ పరీక్ష ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 8 వేలకు పైగా ఉద్యోగాల కోసం ఈ గ్రూప్-4 పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా జూనియర్ అసిస్టెంట్, జూనియర్ అకౌంటెంట్, వార్డ్ ఆఫీసర్ తదితర ఉద్యోగాలు ఉన్నాయి. వీటన్నింటి కోసం డిసెంబర్ 1న నోటిఫికేషన్ జారీ

3వ

# నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

## భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం




మధ్యాహ్నం గవర్నర్ తమిళసై ప్రసంగంతో ప్రారంభం

ప్రజా సమస్యలు ప్రస్తావిస్తామన్న సిఎల్పీ నేత భట్టి

అసెంబ్లీ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు

హైదరాబాద్,ఫిబ్రవరి2(సమసమాజం): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. మధ్యాహ్నం 12 గంటలకు గవర్నర్ తమిళసై ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం అవుతాయి. గవర్నర్ ప్రసంగం తరవాత బిఎసి సమావేశమై అసెంబ్లీ ఎజెండాను ఖరారు చేస్తుంది. ఇకపోతే బడ్జెట్ ఏ రోజు ఉంటుందన్నది ప్రభుత్వం ప్రకటించనుంది. అలాగే ఎన్ని రోజులు సమావేశాలు జరిగేది బిఎసిలో ఖరారు చేస్తారు. సమస్యలపై చర్చించాలని ఇప్పటికే కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. రైతుల సమస్యలు, రుణమాఫీ, కరెంట్ కోతలు, తదితర అంశాలను ప్రస్తావించే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వం చర్చలకు సుముఖంగా ఉందా లేదా అన్నది చూడాలని సిఎల్పి నేత భట్టి విక్రమార్క

3వ

# రాజాబహద్దూర్ వసతి గృహానికి శంకుస్థాపన

## లాభాపేక్ష లేకుండా ప్రగతి సాధించాలన్న హరీష్ రావు

హైదరాబాద్,ఫిబ్రవరి2(సమసమాజం): రాజా బహదూర్ వెంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ అనేది సేవా ఆధారిత, లాభాపేక్ష రహిత సంస్థ అని మంత్రి హరీశ్ రావు అన్నారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ నూతన వసతి గృహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ నూతన వసతి గృహ నిర్మాణానికి మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డితో కలిసి మంత్రి హరీశ్ రావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాజా



3వ పేజీలో...

# సంపాదకీయం

## బడ్జెట్ స్వరూపం మారాల్సిందే !

దేశ సమగ్ర అభివృద్ధి అన్నది బడ్జెట్‌లో ఎక్కడా కానరావడం లేదు. బడ్జెట్ అంటే తాము అనుకున్న విధంగా లెక్కలు సరిచూసుకోవడం సర్వసాధారణమయ్యింది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి వారిని గట్టెక్కించే ప్రయత్నాలు ఏ బడ్జెట్‌లోఊ కానరావడం లేదు. ప్రధాన సమస్యలను పరిష్కరించే సత్తా కాన రావడం లేదు. ఏటేటా బడ్జెట్లు వస్తున్నా సామాన్యులు ఊపిరి పీల్చుకున్న దాఖలాలు కానరావడం లేదు.

బడ్జెట్ అంటే కాకి లెక్కలేనన్న చందంగా తయారయ్యింది. ఈ క్రమంలో దేశ సమగ్ స్వరూపం ప్రతిఫలించే విధంగా బడ్జెట్ తీరు మారాల్సిన అవసరం ఇప్పుడు వచ్చింది. ఇలాంటి బడ్జెట్లు మరో లక్ష ప్రవేశ పెట్టినా భారత్ తలరాత మారదని గుర్తించాలి. దీనిపై మేధావులు, ఆర్థికవేత్తలు చర్చించాలి. దేశానికి మార్గనిర్దేశనం చేయాలి. నిజానికి రాష్ట్రాల సమాహారంగా ఉన్న మన దేశం... కేటాయింపులు సమగ్రంగా..సక్రమంగా ఉండడం లేదు. అలాగే బడ్జెట్ స్వరూపం మారుతోంది. సమగ్రాభివృద్ధి లక్ష్యంగా చర్చ జరగడం లేదు. ఏంచేస్తే ఈ దేశంలో ఉన్న కోటానుకోట్ల దరిద్ర నారాయ ణలు బాగుపడతారో అన్న ఆలోచన లేకుండా ఊరడింపు లెక్కలతో బడ్జెట్ ప్రకటనను కానించేస్తున్నారు. కేవలం అంకెల గారడీ తప్ప దేశ భవిష్యత్ దర్శనం కనిపించడం లేదన్న మేధావులు, ఆర్థిక నిపుణులు ఆందోళన, ఆక్రందనలు అధికారంలో ఉన్నవారి చెవికెక్కడం లేదు. రాజకీయ నాయకుల పెదవి విరుపుల వెనక బలమైన కారణాలు ఉన్నాయా.. అంటే సర్వత్రా ఔననే వినిపిస్తోంది. బడ్జెట్ ద్వారా లెక్కలు అప్పగిం చడం తప్ప మరోటి కానరావడం లేదు. దేశంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. ప్రధానంగా జీఎస్టీ ఆదాయం పెరిగిందని సంతోషించి లెక్కలు చూపుతున్న ప్రభుత్వం ..దాని కారణంగా ఎంతమంది ఎలా.. దెబ్బ తింటున్నారో గమనించడం లేదు. ఆదాయపన్ను పరిమితుల వెనక రాజకీయాలు జోడించడం ఎంతవరకు సబబు. బ్యాంక్ వడ్డీ రేట్లతో ప్రజలు ఎన్నిరకాలుగా అవస్థలు పడు తున్నారో గమనించడం లేదు. పన్నులు వేయాలన్న రాజధర్మం మేరకు పిండుకుంటున్నారు. ప్రజలు వాటిని కట్టగలిగే స్థితిలో ఉన్నారా లేదా అన్నది ఆలోచన చేయడం లేదు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో సామాన్యుల నుంచి పన్నులను మరింతగా పిండుకోవడంలో భాగంగానే ఈ విన్యాసాలని గుర్తించాలి. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.33.6 లక్షల కోట్ల స్థూల పన్ను వసూళ్లను రాబట్టాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నది. 2022-23 సవరించిన బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఇది 10.4 శాతం ఎక్కువ. జీటీఆర్ పెంపుతో జీఎస్టీ, కార్పొరేట్ ట్యాక్స్, ఇన్‌కమ్ ట్యాక్స్, యూనియన్ ఎక్సైజ్ డ్యూటీ, కస్టమ్స్ డ్యూటీలో పెరుగుదల నమోదు కానున్నది. దీంతో అంతిమంగా సామాన్యుడిపై భారం పడనున్నది. ఇక పన్నేతర వసూళ్లు రూ.3.01 లక్షల కోట్లను వసూలు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకొన్నది. 2022-23 సవరించిన బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఇది 15.2 శాతం ఎక్కువ. మొత్తంగా ఆదాయం పెంచుకునే క్రమంలో పన్నులను వేయడంలో సిద్ధహస్తులుగా మారారు. ఇకపోతే బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకో వడం లేదు. రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యాక్రమాలు మందగించేలాకేటాయింపులు అరకొరగా ఉంటున్నాయి. నిరుద్యోగం తాండవిస్తోంది. వ్యవసాయం పడకేస్తోంది. రైతులు రోడ్డెక్కినా వారికి న్యాయం దక్కడం లేదు. విద్య,వైద్యం ఖరీదైనదిగా మారింది. ఈ క్రమంలో బడ్జెట్ స్వరూపం మారాల్సి ఉంది. మొక్కుబడిగా కాకుండా దేశ జనాభా,రాష్ట్రాలు, అవసరాలు,నిధులను బేరీజు వేసుకుని కార్యక్రమాలు రూపొందించేలా బడ్జెట్ రూపకల్పన జరగడం లేదు. ప్రధానంగగా మౌళిక వసతుల కల్పన, అభివృద్ధి తదితర అంశాలను ముందుకు తీసుకుని వెళ్లేలా బడ్జెట్ రూపకల్పన జరగడం లేదు. 75 ఏళ్ల స్వాతంత్ర్యం తరవాత కూడా నేటికీ విద్యుత్, వైద్యం, విద్య, రోడ్లు

వంటి మౌళిక వసతుల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. బడ్జెట్‌తో సంబంధం లేకుండా ప్రజలు తమ కష్టార్జితంతో తాము జీవిస్తున్నారు. ప్రభుత్వానికి పన్నులు కడుతున్నారు. తాము మిగతా పార్టీలకన్నా భిన్నమని చెప్పుకున్న ప్రధాని మోడీ..చేతల్లో మాత్రం ఎలాంటి కొత్తదనం చూపలేకపోతున్నారు. 8 ఏళ్లు గడిచినా సామాన్యుల జీవితాలు బాగు పడలేదు. మధ్యతరగతి ఆశలు నెరవేరలేదు. నేలవిడిచి సాము చేస్తున్న తీరు కళ్లకు కడుతోంది. మాటల గారడీ తప్ప మరోటి గోచరించడం లేదు. ఎలాంటి మెరుపులు, ఆకర్షణలు లేకుండా సాదాసీదాగా ఉంది. బడ్జెట్ అనే కన్నా ఒక ప్రకటన చేసినట్లుగా ప్రసంగం మొత్తం సాగిపోయింది. ఈ ఏడాదైనా తమకు ఏదో ఒరుగుతుందని గంపెడాశలు పెట్టుకున్న ఆయా రాష్ట్రాలకు ఖేదం మిగిలింది. అలాగే వేతనజీవికి నిరాశే మిగిలింది. ప్రభుత్వ మద్దతు కోసం చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్న పలురంగాల ఆశలపై నీళ్లు చల్లారు. ఎవరిపైనా అదనపు వడ్డనలు వేయకపోవడం మాత్రమే కొంత ఊరట కలిగించే అంశంగా చూడాలి. వైద్యరంగాన్ని మరింత బలోపతేంచేస్తారని అనుకున్నా అలాంటి దాఖలాలు కూడా లేవు. గత కొన్నేళ్లుగా ఐటీ పరిమితి పెంచక పోయినా 7లక్షలకు పెంచి శ్లాబ్‌లలో మార్పులు చేస్తూ కొంత ఉపశమనం కలిగించారు. తెలంగాణ సిఎం కెసిఆర్ అన్నట్లుగా ప్రభుత్వానికి దూరదృష్టి లేదు. ఆయారంగాలను ఎలా ముందుకు తీసుకుని వెళ్ళాలన్న భవిష్యత్ దృష్టి కానరాలేదు. ఈ బడ్జెట్ తీరు ఇలాగే కొనసాగితే మరో 75 ఏళ్లు గడిచినా భారతదేశ భాగ్యం మారదు. దేశంలో పురోగతి కనిపించదు. సమస్యలపై సమగ్ర దృష్టితో బడ్జెట్ రూపకల్పన జరగాల్సిన అసవరాన్ని అన్ని పార్టీలు గుర్తించాలి. పేద,మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారింది. బంగారంధరలు పెరుగులు పెడుతున్నాయి. సొంతింటి కల కల్లగా మారింది. ఇల్లు కొందామంటే జిఎస్టీ వాయింపులు భారీగా ఉన్నాయి. పేదలు స్వయంగా తమ జీవనం గడుపుకునే పరిస్థితి లేకుండా పోయింది. బ్యాంకులు సామాన్యులకు అందుబాటు లో లేవు. ఈ సమస్యలన్నీ తీర్చాలన్న సంకల్పం ప్రభుత్వానికి లేకుండా పోయింది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# ఆరోగ్య తెలంగాణ కెసిఆర్ లక్ష్యం

## వైట్‌కోట్ ఉత్సవంలో మంత్రి జగదీశ్ రెడ్డి





సూర్యాపేట,ఫిబ్రవరి2(సమసమాజం): తెలంగాణ సమాజం ఆరోగ్యవంతంగా ఉండేందుకు వైద్యరంగానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. వైద్యానికి ఆమడ దూరంలో ఉన్న సూర్యాపేటను మెడికల్ హబ్‌గా చేసిన ఘనత కేసీఆర్‌దే అని అన్నారు. సూర్యాపేట మెడికల్ కళాశాలలో వైట్ కోట్ ఉత్సవంలో పాల్గొని వైద్య విద్యార్థులకు వైట్‌కోటులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం బాగుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంలో భాగస్వామ్యమై కేసీఆర్ కలలను నిజం చేయాలని అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వైద్య విద్యలో ఎంబీబీఎస్ నుంచి పీజీ వరకు విద్యార్థులు సూర్యాపేట కు రావడం ఈ ప్రాంతానికి గర్వకారణమన్నారు. మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 160 కోట్లు విడుదల చేసిందన్నారు. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్న మెడికల్ కళాశాల భవనాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. నర్సింగ్ కాలేజ్ ను కూడా ప్రస్తుతం ఉన్న మెడికల్ కాలేజ్ ప్రాంగణం లో నిర్మించి మెడికల్ హబ్ గా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపల్ శారద, సూపరింటెండెంట్ మురళీధర్ రెడ్డి, ఎస్పీ రాజేంద్ర ప్రసాద్, అడిషనల్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తృణధాన్యాల పరిశోధనలకు ప్రోత్సాహం

**శ్రీ అన్న కార్యక్రమంలో భాగంగా నిధుల కేటాయింపు ● దక్కన్ డెవలప్‌మెంట్ లాంటి సంస్థలను ప్రోత్సహిస్తే మంచిది**

హైదరాబాద్,ఫిబ్రవరి2(సమసమాజం): తృణధాన్యాల పరిశోధనను ప్రోత్సహించడానికి హైదరాబాద్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్(ఐఐఎంఆర్)కు మద్దతిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. భారత్‌ను తృణధాన్యాల్లో అంతర్జాతీయ హబ్‌గా తీర్చి దిద్దేందుకు శ్రీ అన్న కార్యక్రమాన్ని ప్రకటించారు. శ్రీ అన్న కార్యక్రమంలో భాగంగా పరిశోధనలను ప్రోత్సహించడానికి హైదరాబాద్‌లోని ఐఐఎంఆర్ సంస్థకు మద్దతిస్తామని చెప్పారు. నిజానికి ఇప్పటికే దక్కన్ డెవలప్‌మెంట్ సంస్థ తృణధాన్యాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోంది. ఇలాంటి సంస్థలను గుర్తించి ప్రోత్సహించాల్సి ఉంది. అలాగే సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం మంచిదే అయినా.. దాని ఫలితాలపై అధ్యయనం చేయాలి. పంటల దిగుబడి ఎలా ఉంటుందో చూడాలి. ఇకపోతే విదేశాల మద్దతుతో చేపట్టే ఐఐటీ, హైదరాబాద్ క్యాంపస్ అభివృద్ధి ప్రాజెక్టు రెండో దశకు కేంద్రం రూ.254.66 కోట్లు కేటాయిం చింది. ఇది హైదరాబాద్‌కు ఎంతో పేరు తీసుకుని వచ్చే నిర్ణయంగా చూడాలి.ఏకలవ్య మోడల్ పాఠశాలలకు బ్జడెట్లో రూ.5,943 కోట్లు కేటాయించారు. ఈ పథకం కింద తెలంగాణలోని 23 ఏకలవ్య పాఠశాలల్లో ఒక్కో స్కూల్‌కు టీచర్లు 29 మంది, నాన్ టీచింగ్ 23 మంది మొత్తం 52 మంది చొప్పున రానున్నారు. మిగతా సిబ్బందిని లోకల్ క్యాడర్ కింద జిల్లా కలెక్టరు నియమిస్తారు. తెలంగాణకు అదనంగా మరో 7 ఏకలవ్య మోడల్ పాఠశాలలు కావాలని రాష్ట్ర సర్కారు కోరింది. ఆదిమ జాతుల అభివృద్ధి కోసం గతంలో కేంద్రం ప్రకటించిన సొమ్ములో తెలంగాణకు కేవలం రూ.8, 9 కోట్లు మాత్రమే దక్కేవి. ఈసారి ఈ పథకం కింద రూ.15 వేల కోట్లు కేటాయించిన నేపథ్యంలో రాష్ట్రానికి రూ.100 కోట్లకు మించి దక్కుతుందని భావిస్తు న్నారు. రాష్ట్రంలో 90 వేల మంది ఆదిమ జాతుల గిరిజనులు ఉన్నారు. ఇకపోతే సింగరేణిలో పెట్టుబడులకు రూ. 2 వేల కోట్లు ప్రతిపాదించి రూ. 1600 కోట్లకు కుదించింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ సంస్థకు రూ. 135.46 కోట్లు కేటాయించి రూ. 114.59 కోట్లకు తగ్గించింది. పన్నుల్లో వాటా కొంత పెరగడం రాష్ట్రానికి ఊరటనిస్తోంది. పన్నుల వాటా కింద రాష్ట్రాలకు కేంద్రం 41 శాతం నిధులను విడుదల చేస్తుంది. రూ.10,21,448 కోట్లు వస్తాయని ప్రకటించి, రాష్ట్ర వాటా 2.10 శాతం ప్రకారం... రూ.21,470 కోట్లను కేటాయించింది. ముగుస్తున్న ఆర్థిక సంవత్సరంలో రూ.19,663 కోట్లను మాత్రమే కేటాయించింది. అంటే... తాజా బ్జడెట్‌లో రాష్ట్రానికి అదనంగా రూ.1,807 కోట్లు రానున్నాయి. ఇది ఒకింత రాష్ట్రానికి ఊరటే. హైదరాబాద్ ఐఐటీకి రూ.300 కోట్లు, సింగరేణికి రూ.1,650 కోట్లను కేటాయించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని రెండు గిరిజన విశ్వవిద్యాలయాలకు రూ.37 కోట్లను కేటాయించింది. ఈ రెండు వర్సిటీలకు రెవెన్యూ ఎక్స్‌పెండిచర్ కింద మరో రూ.కోటి కేటాయించారు. రాష్ట్ర గిరిజన విశ్వవిద్యాలయానికి రూ.18 కోట్లకు పైగా నిధులు రానున్నాయి. మంగళగిరి, బీబీనగర్‌లతో సహా దేశంలోని మొత్తం 22 ఎయిమ్స్‌లకు రూ.6,835 కోట్లను ప్రకటించినందున... రాష్ట్రంలోని బీబీనగర్ ఎయిమ్స్‌కు రూ.300 కోట్ల మేర నిధులు వస్తాయని అంచనా. హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంతో కలిపి దేశంలోని అన్ని మ్యూజియంలకు రూ.357 కోట్లను కేంద్రం ప్రకటించింది. హైదరాబాద్ నైపర్ సహా దేశంలోని 7 నైపర్‌లకు రూ.550 కోట్లు ఇచ్చారు.




# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

## జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



జగిత్యాల,ఫిబ్రవరి2(సమసమాజం): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం 12 రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మన బస్తీ- మన బడి కార్యక్రమంలో పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి 11 శాతం నిధులు ఖర్చుచేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తుందని తెలిపారు. కేంద్రం తెలంగాణ పట్ల చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 150 మెడికల్ కళాశాలలు కేంద్రం మంజూరు చేస్తే తెలంగాణకు ఒక్కటి కూడా మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు దేశ వ్యాప్తంగా 750 జిల్లాలు పోటీ పడితే జగిత్యాల జిల్లాకు ద్వితీయ స్థానం దక్కిందన్నారు. జగిత్యాల పట్టణంలో రూ. 20 కోట్లతో నర్సింగ్ కాలేజీ, పోలాస వ్యవసాయ కళాశాలకు రూ. 20 కోట్లు, మెడికల్ కళాశాల మంజూరయ్యిందన్నారు. తెలుగుకు ప్రాచీన భాషా తీసుకు రావడంలో ముఖ్యమంత్రి , ఎమ్మెల్సీ కవిత కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గోలిశ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గట్టు సతీశ్, కౌన్సిలర్లు పంబల రామ్ కుమార్,వొద్ది శ్రీలత రామ్మోహన్ రావు, బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

# నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం

## తమిళనాడులో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు



చెన్నై,ఫిబ్రవరి2(సమసమాజం): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తమిళనాడులోని నాగపట్నం జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపిలేని వర్ష్యాలతో తడిసి ముద్దయ్యింది. ఈ పరిస్థితి మరికొద్ది కొనసాగ నుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో నాగపట్నం, మైలాడుతురై జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. శ్రీలంకలోని బట్టికలోవాకు 60కిలో మీటర్ల దూరంలో తమిళనాడులోని కరైకల్ కు 400 కిలో మీటర్ల దూరంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉన్నట్టు భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఇది తీవ్రమై తీరం దాటే అవకాశం కూడా ఉందని స్పష్టం చేసింది. ఈ ప్రభావంతో దక్షిణ తమిళనాడులోని చాలా ప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెన్నై వాతావరణ కేంద్రం తెలిపింది.



# దేశంలో ఆర్థికాభివృద్ధి కన్నా రాజకీయాలకే ప్రాధాన్యమా !

## ఆర్థిక అభివృద్ధిపై దృష్టి సారిస్తే నంబర్ వన్ స్థాయికి చేరుతాం

## 'డీకోడ్ ది ఫ్యూచర్' అంశంపై నిర్వహించిన సదస్సులో కెటిఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి2(సమసమాజం): భారత్‌లో ఆర్థికాభివృద్ధి కన్నా.. రాజకీయాలపై దృష్టిపెడతారని మంతరి కెటిఆర్ అన్నారు. అయితే ఇతర దేశాల్లా మన దేశంలోనూ ఆర్థిక అభివృద్ధిపై దృష్టిసారిస్తే నంబర్ వన్‌గా ఎదుగుతామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశాభివృద్ధి కోసం నిధులు కేటాయించినట్లు కనపడటంలేదని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలో ఎన్నికల కోసమే ప్రభుత్వాలు పనిచేస్తాయని విమర్శించారు. చైనా, జపాన్ లాంటి దేశాలు అభివృద్ధిలో ముందున్నాయని చెప్పారు. భారత్‌లో ఆర్థికాభివృద్ధి కన్నా.. రాజకీయాలపై దృష్టిపెడతారు. అయితే ఇతర దేశాల్లా మన దేశంలోనూ ఆర్థిక అభివృద్ధిపై దృష్టిసారిస్తే నంబర్ వన్‌గా ఎదుగుతామని వెల్లడించారు. ప్రపంచంలో గుర్తించదగిన బ్రాండ్స్ మన దేశం నుంచి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ఎన్‌హెచ్‌ఆర్డీ 'డీకోడ్ ది ఫ్యూచర్' అనే అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సుకు మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మనదేశంలో మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. మొత్తం జనాభాలో 60 శాతం మంది యువతేనని తెలిపారు. దేశంలో యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నదని వెల్లడించారు. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆలోచన చేయడం లేదన్నారు. సింగపూర్ విస్తీర్ణంలో హైదరాబాద్ కన్నా చిన్నగా ఉంటుంది. అయినా అభివృద్ధిలో మాత్రం వేగంగా ముందుకెళ్తున్నదని చెప్పారు. గత ఎనిమిదేండ్లుగా అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ.. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నది. దేశ జీడీపీలో 5 శాతం వాటా తెలంగాణదే అని తెలిపారు. 4.6 ట్రిలియన్ ఎకానమీకి తెలంగాణ చేరుకుందన్నారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇంక్లూజిన్ గ్రోత్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. టీఎస్‌ఐపాస్ ద్వారా పదిహేను రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతిస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. 15 రోజులు దాటితే సంబంధిత అధికారి నుంచి రోజుకు రూ.వెయ్యి చొప్పున ఫెనాల్టీ వసూలు చేస్తున్నామని చెప్పారు. గత 75 ఏండ్లలో ఏ ప్రభుత్వం ఇలా చేయలేదన్నారు. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సంస్థల తమ రెండో అతిపెద్ద క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాయన్నారు. ప్రపంచ వ్యాక్సిన్ క్యాపిటల్‌గా హైదరాబాద్ వెలుగొందుతున్నదని తెలిపారు. 1/3వ వంతు వ్యాక్సిన్లు ఇక్కడే తయారవుతున్నాయని వెల్లడించారు. ఐటీ, అగ్రికల్చర్ గ్రోత్ ప్రతిఏడాది పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను నాలుగేండ్లలోనే పూర్తిచేశామన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అద్భుతంగా అభివృద్ధిలో ముందుకెళ్తున్నదని చెప్పారు.

# తొమ్మిదేళ్లుగా కెసిఆర్ ఏం చేశారు



## పాదయాత్రను ప్రారంభించిన షర్మిల

వరంగల్,ఫిబ్రవరి2(సమసమాజం):తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి కేసీఆర్ రాష్ట్రానికి ఏమైనా చేశారా అని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల ప్రశ్నించారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చని బీఆర్ఎస్ పాలనకు అంతం పలకాలని ప్రజలను కోరారు. వైఎస్ షర్మిల చేపట్టిన ప్రజా ప్రస్థానం పాదయాత్ర తిరిగి గురువారం నుంచి పునఃప్రారంభం అయింది. వరంగల్ జిల్లా లింగగిరి ఎక్స్ రోడ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి షర్మిల నివాళులు అర్పించారు. ఈ ఏడాది రాష్ట్రానికి ఎన్నికలు జరగనున్నాయని, మళ్లీ ఓట్ల కోసం కేసీఆర్ వస్తారని షర్మిల అన్నారు. కేసీఆర్ మాటలు విని మోసపోవద్దన్నారు. డబ్బులిస్తే తీసుకోవాలని కానీ ఓటు మాత్రం మీ కోసం పాటు పడే పార్టీకే వేయలన్నారు. వైఎస్సార్ సంక్షేమ పథకాలు అమలు చేయడమే తన ధ్యేయమని ఈ సందర్భంగా షర్మిల వెల్లడించారు.

# రాజాబహద్దూర్ వసతి గృహానికి శంకుస్థాపన



(మొదటి పేజీ తరువాయి) బహదూర్ వెంకట రామారెడ్డి స్థాపించిన ఎడ్యుకేషనల్ సొసైటీ విస్తరణలో భాగంగా ఈరోజు కొత్త భవనానికి భూమి పూజ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. డబ్బులు సంపాదించే విద్యా సంస్థగా కాకుండా పేద విద్యార్థులకు విద్యను అందించి సమాజంలో ఉన్నతమైన విలువలు నెలకొల్పాలని మంత్రి అన్నారు. పేద గ్రామీణ యువత ఉన్నత విద్యను చాలా తక్కువ ఖర్చుతో అభ్యసించడానికి ఈ సంస్థ సేవలు అందిస్తుందన్నారు. ముఖ్యంగా బాలికల విద్య కోసం రాజా బహదూర్ వెంకట రామారెడ్డి చేసిన కృషి ఈరోజు ఎంతోమంది పేద గ్రామీణ విద్యార్థినిలకు అవకాశాన్ని కల్పించిందని కొనియాడారు. పేద గ్రామీణ యువతకు తక్కువ ఖర్చుతో ఉన్నత విద్యను అందించేందుకు ప్రపంచ స్థాయి విద్యా సంస్థ, వసతి గృహ సముదాయాన్ని ఏర్పాటు చేయడం కోసం బద్వేల్‌లో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి సీఎం కేసీఆర్ గొప్ప మనసు చాటుకున్నారన్నారు. భారత మాజీ ప్రధాని దివంగత శ్రీ పి.వి.నరసింహారావు, స్వర్గీయ శ్రీ రావి నారాయణరెడ్డి, మాజీ కేంద్ర మంత్రి శ్రీ ఎస్. జైపాల్ రెడ్డి, జస్టిస్ ఎ. సీతారాంరెడ్డి, జస్టిస్ బి.పి.జీవన్ రెడ్డి, రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, తదితర ప్రముఖులు రాజా బహదూర్ వెంకట రామారెడ్డి హాస్టల్లో ఉన్నవారే అని మంత్రి పేర్కొన్నారు. ఈ భవన నిర్మాణానికి రూ. ఐదు కోట్ల నిధులను త్వరలో విడుదల చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్మన్ సునీత లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి , శ్రీధర్ రెడ్డి, రాజా బహదూర్ వెంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఢిల్లీ లిక్కర్ స్కామ్ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి) ప్రస్తావించింది. లిక్కర్ స్కాం ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్ నాయర్ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తో ఫేస్ టైం వీడియోకాల్ ద్వారా సమీర్ మహేంద్రుతో మాట్లాడించినట్లు ఈడీ ఛార్జ్ షీటులో పేర్కొంది. ఈ లావాదేవీల ద్వారా వచ్చిన సొమ్మును ఆమ్ ఆద్మీ పార్టీ గోవాలో ఎన్నికల ప్రచారానికి వాడుకుందని ఆరోపించింది. లిక్కర్ లైసెన్సులు ఇప్పించేందుకుగానూ ఆప్ నాయకుల తరఫున విజయ్ నాయర్ సౌత్ గ్రూప్ నుంచి రూ.100 కోట్లు అడ్వాన్స్ తీసుకున్నట్లు గుర్తించినట్లు ఈడీ చెబుతోంది. సౌత్ గ్రూపులో టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, అరబిందో ఫార్మాకు చెందిన శరత్ చంద్రారెడ్డి ఉన్నారని వారి ప్రతినిధులుగా అభిషేక్ బోయిన్ పల్లి, రామచంద్ర పిళ్లై, బుచ్చిబాబు వ్యవహరించినట్లు ఛార్జ్ షీటులో స్పష్టం చేసింది. ఢిల్లీ మద్యం స్కామ్ లో ఈడీ దాఖలు చేసిన రెండో ఛార్జ్‌షీటులో తన పేరుండటంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. అవినీతికి వ్యతిరేకంగా ఈడీ పనిచేయడం లేదన్నారు. ప్రభుత్వాలను కూల్చడానికి ఈడీ పనిచేస్తోందని ఆరోపించారు. ఈడీ ఛార్జ్‌షీట్ మొత్తం కల్పితమన్నారు?. ఈడీ ఇప్పటివరకూ 5 వేలకు పైగా ఛార్జ్‌షీట్లు దాఖలు చేసిందని, అయితే ఇప్పటివరకూ ఎంతమందికి శిక్షలు పడ్డాయో చెప్పాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఇప్పటికే విచారించిన వారి జాబితాలో అలాగే ఆధారాలను ధ్వసం చేసిన వారిలో కూడా కవిత పేరును ప్రస్తావించారు. ఢిల్లీ ఒబెరాయ్ హోటల్‌లో జరిగిన సమావేశాల్లో కవిత పాల్గొన్నట్లుగా ఛార్జ్‌షీట్‌లో ఈడీ అధికారులు తెలిపారు. మొత్తం 17 మంది నిందితులపై ఈడీ అభియోగాలు మోపింది. ఢిల్లీ మద్యం స్కామ్ డబ్బులను గోవా ఎన్నికల్లో ఆప్ ఉపయోగించిందని ఈడీ తమ ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఇప్పటికే నిందితుల ఆస్తులు అటాచ్ చేసింది. వ్యాపారవేత్త సమీర్ మహేంద్రు, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన విజయ్ నాయర్ ఇళ్లను అటాచ్ చేసింది. అలాగే దినేష్ అరోరా రెస్టారెంట్‌ను, అమిత్ అరోరా ఆస్తులను



కూడా అటాచ్ చేసింది. ఈ కుంభకోణం కేసులో దక్షిణాది నుంచి ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన కొందరు నేతలకు హవాలా మార్గంలో ముడుపులు అందినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పునరుద్ఘాటించింది. మద్యం పాలసీ కుంభకోణంలో సిండికేట్ కారణంగా ఢిల్లీ సర్కారుకు రూ. 2,873 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు చార్జ్‌షీట్‌లో స్పష్టంచేసింది. ఈ కేసులో సమీర్ మహేంద్రుపై ఈడీ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి/ఎక్సైజ్ మంత్రి మనీశ్ సిసోడియాతో పాటు 14 మందిని నిందితులుగా చేరుస్తూ ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు గుర్తుచేసింది. భారీ ఎత్తున అక్రమార్జనకు లోపభూయిష్టంగా విధానాన్ని రూపొందించారని తెలిపింది. హోల్‌సేలర్ల లాభాలను 12 శాతానికి నిర్ణయించారని, అందులో 6 శాతం మేరకు తిరిగి ముడుపులుగా చెల్లించాలనుకున్నారని, అందుకోసం ఖాతా పుస్తకాలను కూడా తారుమారు చేశారని వెల్లడించింది. ఈ కుట్రలో ఆప్‌కు మొత్తం రూ. 100 కోట్ల ముడుపులు అందాయని తెలిపింది. సమీర్ మహేంద్రు రూ. 295.45 కోట్ల మేర నేరానికి పాల్పడ్డారని, ఈ మేరకు సాక్ష్యాధారాలు లభించాయని ఈడీ పేర్కొన్నట్లు కోర్టు స్పష్టం చేసింది.

# హైదరాబాద్‌లో మరో భారీ అగ్ని ప్రమాదం



(మొదటి పేజీ తరువాయి) చేరుకుని మంటలను ఆర్పివేస్తున్నారు. డెకరేషన్ సామాను గోడౌన్ లో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పక్కనే ఉన్న మరో రెండు గోడౌన్లకు కూడా మంటలు వ్యాపించాయి. ఫైర్ ఇంజన్స్ తో పాటు వాటర్ ట్యాంకర్స్ తెప్పించి మంటలను అదుపు చేయడానికి ఫైర్ సిబ్బంది ప్రయత్నించారు. గోడౌన్స్ పాతవి కావడంతో పైకప్పు రేకులు కూలిపోతున్నాయి. పక్కన ఉన్న మరో ఒఇఆ లైట్స్ గౌడాన్ లోకి మంటలు వ్యాపించకుండా ఫైర సిబ్బంది ఆర్పివేస్తున్నారు. లైట్స్ గోడౌన్ లోకి పాకితే మరింత ఎక్కువగా మంటలు వ్యాపించే అవకాశం ఉంది. ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్.. చిక్కడపల్లోని డెకరేషన్ సామాగ్రి గోడౌన్ కు వెళ్లారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్రమంగా గోడౌన్స్ నిర్వహించే వారిని మంత్రి తలసాని హెచ్చరించారు. ÷ర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇదే అందరికీ ÷నైల్ వార్నింగ్ అని హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ లో అక్రమంగా నిర్వహిస్తున్న వాణిజ్య భవనాలను, గోడౌన్స్ ను గుర్తిస్తామని చెప్పారు. నగరంలో ఇలాంటివి వేల సంఖ్యలో ఉన్నాయన్నారు. అగ్నిప్రమాదానికి గురైన గోడౌన్ ను కూల్చివేస్తామని చెప్పారు. అగ్నిప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు చెప్పారు. సుమారు కోటి రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి అక్రమ గోడౌన్ లను గుర్తించి.. వాటి యజమానులకు నోటీసులు అందిస్తామన్నారు. ఇప్పటి నుంచి అన్ని వ్యాపార సంస్థలు పోలీసుల పర్మిషన్ తీసుకోవాలన్నారు.

## హవాలా ముసుగులో నకిలీ కరెన్సీ చలామణి
### ముఠాను పట్టుకుని సొమ్ము స్వాధీనం




హైదరాబాద్,ఫిబ్రవరి2(సమసమాజం): హవాలా ముసుగులో నకిలీ కరెన్సీని అంటగట్టి రూ. 80 లక్షలతో ఉడాయించిన అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌కు చెందిన నలుగురు నిందితులను కటకటాల్లోకి నెట్టారు. వారి నుంచి రూ. 72.50 లక్షల నగదుతో పాటు, నకిలీ కరెన్సీని సీజ్ చేశారు. హైదరాబాద్ అడిషనల్ సీపీ ఏఆర్ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌తో కలిసి వివరాలు వెల్లడించారు.

# నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



(మొదటి పేజీ తరువాయి) అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి, సమాధానం రాబట్టే ప్రయత్నం చేస్తామని అన్నారు. బిజెపికి ముగ్గురు సభ్యులు ఉన్నా ఈటెల రాజేందర్‌ను అసెంబ్లీకి దూరంగా ఉంచడానికే ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఏదో ఒక నెపం మోపి ఆయనను సమావేశాలకు దూరం చేస్తున్న తీరుపై విమర్శలు వస్తున్నాయి. ఇకపోతే సమస్యలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని అసెంబ్లీ వ్యవసహారాల మంత్రి వేముల ప్రశాంత రెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యం పరిసరాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. నెల 3న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అసెంబ్లీ పరిధిలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ అడిషనల్ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. ఖైరతాబాద్, బషీర్‌బాగ్, రవీంద్రభారతి, మాసబ్‌ట్యాంక్, లక్డీకాపూల్, ఎంజే మార్కెట్, నాంపల్లి ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలు చేరుకోవాలని సూచించారు. పరిస్థితులను బట్టి ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయన్నారు. ఇకపోతే రాష్ట్ర శాసనసభ సమావేశాల పనితీరు దేశంలోనే ఆదర్శంగా ఉన్నదని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ సభల్లో అర్థవంతమైన చర్చ జరిగేందుకు అందరూ సహకరించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో అన్ని చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర శాసనసభ సమావేశాల హుందాతనం, ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ ప్రతి అంశంపై సమగ్రంగా చర్చించాలన్నారు. సమావేశాలు పారదర్శకంగా జరిగేందుకు అధికారులు సహకారం అందించాలన్నారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గత సమావేశాలకు సంబంధించిన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు ఇవ్వని పక్షంలో తక్షణమే ఇవ్వాలని అన్నారు. సమాచారాన్ని తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ భాషలో అందించాలని సూచించారు. సమావేశాలు జరిగినన్ని రోజులు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతీ శాఖ తరఫున ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలన్నారు. శాసనసభ సమావేశాల కోసం జారీ చేసిన పాస్‌లు ఉన్నవారినే ఆవరణలోకి అనుమతివ్వాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదేశించారు. సమావేశాలు ప్రశాంత వాతావరణంలో జరగాలన్నారు.

# ప్రతి ఒక్కరూ సిపిఆర్ సిస్టం తెలుసుకోవాలి
## గవర్నర్ తమిళిసై సూచన



హైదరాబాద్,ఫిబ్రవరి2(సమసమాజం): ప్రతి ఒక్కరు సీపీఆర్ అంటేకార్డియోపల్మనరీ రీససిటేషన్ పద్ధతి నేర్చుకోవాలని గవర్నర్ తమిళి సై అన్నారు. రాజ్ భవన్ కమ్యూనిటీ హాల్‌లో గాంధీ మెడికల్ కాలేజ్ కు చెందిన వైద్యులతో సీపీఆర్ పై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన తమిళి సై.. సామాన్య ప్రజలకు సీపీఆర్ తెలియాలనే ఉద్దేశంతోనే ఈ ట్రైనింగ్ ఇస్తున్నామని అన్నారు. సీపీఆర్ లైఫ్ సేవింగ్ ప్రోగ్రాం అని..టీవీల్లో చూసైనా నేర్చుకోవాలని సూచించారు. సీపీఆర్ తెలియక ఎంతో మంది హార్ట్ స్ట్రోక్ తో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మందికి పబ్లిక్ ప్లేసుల్లో హార్ట్ స్ట్రోక్స్ వస్తున్నాయని తమిళి సై అన్నారు. రెండు మూడు సార్లు ట్రైన్, ÷÷-లట్ లో వెళ్లేటప్పుడు తన ముందే హార్ట్ స్ట్రోక్ వస్తే సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడానని చెప్పారు. తాను డాక్టర్ అని తెలియక చాలా మంది తనను పిలవరని అన్నారు. దేశ వ్యాప్తంగా రెండు శాతం మందే సీపీఆర్ నేర్చుకున్నారని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో సీపీఆర్ నేర్చుకున్న వాళ్లు చాలా ఎక్కువగా ఉంటారని చెప్పారు.




# గ్రూప్-4 పరీక్ష తేదీ ప్రకటన

(మొదటి పేజీ తరువాయి) చేసింది. దరఖాస్తుల పక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. రేపటితో దరఖాస్తుల పక్రియ ముగియనుంది. భారీ ఎత్తున అభ్యర్థులు పోటీ పడుతుండటంతో పరీక్షలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# పార్లమెంటులో ఆదానీ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి) గురించని ఆయన స్పష్టం చేశారు. అదానీ గ్రూపు కంపెనీలపై వెలువడిన హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చించాలని ప్రతిపక్షాలు గురువారం ప్రభుత్వాన్ని డిమాండు చేశాయి. అదానీ గ్రూపు అక్రమాలకు, అవకతవకలకు పాల్పడినట్లు హిండెన్‌బర్గ్ రిసెర్చ్ చేసిన ఆరోపణలపై దర్యాప్తునకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జెపిసి) ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపక్షాలు కోరాయి. పార్లమెంట్‌లో అనుసరించ వలసిన వ్యూహాన్ని చర్చించేందుకు భావసారూప్యతగల ప్రతిపక్షాలు గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు సమావేశమయ్యాయి. ఈ అంశంపై సభ చర్చించాలని కోరుతూ పలువురు ప్రతిపక్ష ఎంపిలు సంబంధిత సభలకు నోటీసులు ఇచ్చాయి. అయితే సభ్యుల ఆందోళనతో ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడ్డాయి.ఇలా ఉండగా..ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి సంజయ్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ మోసాలు, అబద్ధాలతో గౌతమ్ అదానీ నిర్మించిన సౌధాలు పేకమేడల్లా కూలిపోతున్నాయని ఆరోపించారు. దేశంలోని కోట్లాదిమంది పెట్టుబడిదారులు ఆందోళన చెందుతున్నారని, అదానీ కంపెనీలకు వేల కోట్లలో రుణాలిచ్చిన ఎల్ఐసి, ఎస్‌బిఐ పరిస్థితే ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోడీ సభనుద్దేశించి వాస్తవాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంత భారీ స్థాయిలో అవినీతి జరిగితే ఆర్‌బిఐ, ఇడి, సిబిఐ ఏం చేయకుండా ఎందుకు ఉన్నాయో ఆర్థిక మంత్రి చెప్పాలని, ఎఫ్‌పిఓ కేవలం ఆరంభమేనని, అదానీ అసత్యాల గుట్టలు కూలిపోవడం తథ్యమని సంజయ్ సింగ్ అన్నారు. అదానీ పాస్‌పోర్టును జప్తు చేసుకోవాలని కోరుతూ ప్రధాని మోడీకి లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. ఇకపోతే అదానీ కంపెనీలపై అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ ఇచ్చిన రిపోర్టుపై చర్చ చేపట్టాలని పార్లమెంటు ఉభయసభల్లో బీఆర్ఎస్ తీర్మానం ప్రవేశ పెటింది. ఈ నివేదికతో దేశ ప్రజలపై, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడిందని వాదించింది. ఈ అంశంలో బీఆర్ఎస్ ఎంపీ కేశవరావు రాజ్యసభలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. రూల్ 267 కింద చర్చ చేపట్టాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఇక లోక్‌సభలోనూ ఇదే అంశంపై చర్చించాలని బీఆర్ఎస్ నేత నామా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కేవలం బీఆర్ఎస్ మాత్రమే కాదు అదానీ గ్రూపు పాల్పడిన ఆర్థిక అవకతవకలపై చర్చించాలని ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పార్టీ కూడా ఉభయసభల్లోనూ వాయిదా



తీర్మానం ప్రవేశపెట్టాయి. 267 చట్టం కింద ఈ అంశాన్ని చర్చించాలని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ కోరారు. అదానీ గ్రూపు మోసానికి పాల్పడినట్లు ఆయన ఆరోపించారు.

# దుమ్మురేపుతున్న సూర్యకుమార్ యాదవ్



పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా స్టార్ సూర్యకుమార్ యాదవ్ హవా కొనసాగుతోంది.ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లోనూ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్న మిస్టర్ 360.. ఇంగ్లండ్ బ్యాటర్ డేవిడ్ మలన్ అరుదైన రికార్డుపై కన్నేశాడు. కాగా న్యూజిలాండ్‌తో స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌తో సూర్య బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాంచిలో జరిగిన తొలి మ్యాచ్‌లో 34 బంతుల్లో 47 పరుగులు చేసిన సూర్యకుమార్ యాదవ్.. 910 రేటింగ్ పాయింట్లు సాధించి సత్తా చాటాడు. అయితే, రెండో టీ20లో 31 బంతుల్లో 26 పరుగులు చేసి ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు. ఈ నేపథ్యంలో రెండు పాయింట్లు కోల్పోయి 908 రేటింగ్ పాయింట్ల వద్ద నిలిచిపోయాడు. అయితే, అహ్మదాబాద్‌లో ఆఖరిదైన మూడో టీ20లో ఈ ముంబైకర్ బ్యాట్ ఝులిపిస్తే గనుక కెరీర్ బెస్ట్ రేటింగ్ అందుకునే అవకాశం ఉంది. కాగా 2020లో ఇంగ్లండ్ బ్యాటర్ డేవిడ్ మలన్ 915 పాయింట్లతో టీ20 ర్యాంకింగ్స్‌లో సత్తా చాటాడు. పాయింట్ల రికార్డు విషయంలో సూర్య ప్రస్తుతం మలన్ తర్వాతి స్థానంలో కొనసాగుతున్నాడు. క టీ20 ఫార్మాట్‌లో దుమ్మురేపుతున్న సూర్యకుమార్ యాదవ్.. ఐసీసీ టీ20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే టీమిండియాతో సిరీస్‌లో సత్తా చాటిన కివీస్ ఓపెనర్ ఫిన్ అలెన్.. ఎనిమిది స్థానాలు ఎగబాకి 19వ ర్యాంకుకు చేరుకున్నాడు. అదే విధంగా డారిల్ మిచెల్ తొమ్మిది స్థానాలు మెరుగుపరచుకుని 29వ స్థానంలో నిలిచాడు.

# టీమ్? కోసమే ధోనీలా చేయాల్సి వస్తుంది



మహేంద్ర సింగ్? ధోనీ రిటైరయ్యాక ఆ బాధ్యత నేను తీసుకున్నానంటూ టీమ్? ఇండియా స్టాండ్? ఇన్? కెప్టెన్ హార్దిక్ పాండ్య పలు కీలక వ్యాఖ్యలు చేశాడు. న్యూజిలాండ్?తో జరిగిన మూడో టీ20లో విజయం సాధించిన తర్వాత.. గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ పలు కీలక అంశాల గురించి మాట్లాడాడు. ఆ వివరాలు.. టీమ్? కోసం ధోనీ చేసినట్లే తాను కూడా చేయగలనంటూ టీమ్?ఇండియా కెప్టెన్? హార్దిక్? పాండ్య అన్నాడు. బుధవారం జరిగిన న్యూజిలాండ్ వర్సెస్? భారత్? మ్యాచ్?లో టీమ్?ఇండియా విజయం తర్వాత హార్దిక్ ధోనీని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశాడు. "మహీ బాధ్యతను తీసుకోవడానికి నేను వెనుకాడను. మాహీ ఈ పాత్రను పోషించేవాడు. ఆ సమయంలో నేను యువకుడిగా ఉన్నాను. గ్రౌండ్ నలుమూలలా సిక్స్?లు బాదేవాడిని. కానీ ఆయన వెళ్లిన తర్వాత ఆ బాధ్యతను నేను తీసుకున్నాను. కానీ దాన్ని నేను పెద్దగా పట్టించుకోను. ఫలితాలు వస్తున్నాయి. నెమ్మదిగా ఆడటం వల్ల నష్టమేమీ లేదు" అని హార్దిక్ అన్నాడు."నేను సిక్స్?లు కొట్టడాన్ని ఎప్పుడూ ఎంజాయ్ చేస్తాను. కానీ జీవితమంటే అదే. ఎప్పుడూ మారుతూనే ఉంటుంది. నేను భాగస్వామ్యాలను నమ్ముతున్నాను. నేను క్రీజులో ఉన్నానన్న నమ్మకాన్ని నా బ్యాటింగ్ పార్ట్‌నర్‌కు, నా టీమ్ కు ఇవ్వాల్సిన అవసరం ఉంది. టీమ్?లో ఉన్న అందరి కంటే నేనే ఎక్కువ మ్యాచ్?లు ఆడాను. ఒత్తిడిని ఎలా అధిగమించాలి.. బయటకు ప్రశాంతంగా ఎలా కనిపించాలో నాకు తెలుసు. దాని కోసమే నా స్ట్రైక్ రేట్ ను తగ్గించుకున్నా. కొత్త రోల్స్?ను తీసుకోవడానికే నేను ఎప్పుడూ ఇష్టపడుతుంటాను. అందుకే నేను కొత్త బంతితోనూ బౌలింగ్ చేస్తున్నాను. ఎందుకంటే ఎవరో ఆ క్లిష్టమైన రోల్ తీసుకోవాలని నేను అనుకోను. నేను ముందుండి నడిపించాలని అనుకుంటాను. కొత్త బంతితో బౌలింగ్ నైపుణ్యాలను పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాను" అని పాండ్యా అభిప్రాయపడ్డాడు. గాయాలతో మ్యాచ్?కు దూరమైన జస్ప్రీత్? బుమ్రా స్థానాన్ని భర్తీ చేసేందుకు హార్దిక్? కొత్త బాల్?ను పట్టుకున్నాడు. అలా పవర్‌ప్లేలో 12 ఓవర్లకు బౌలింగ్? చేసిన పాండ్య.. హెూమ్ సీజన్‌లో రెండు వికెట్లకు 86 పరుగులు ఇచ్చాడు. "నేను టీ20లో కొత్త బంతితో బౌలింగ్ చేయాల్సి వచ్చింది. ఎందుకంటే అర్షదీప్? లాంటి న్యూ ప్లేయర్స్? కొత్త బంతితో మొదట బౌలింగ్ చేసే కష్టమైన పాత్రను పోషించడం నాకు ఇష్టం లేదు. ఒక వేళ వారిపై ఒత్తిడిని తీసుకొస్తే అది ఆటను అన్ని విధాలుగా నష్టపరుస్తుంది. అందుకే నేను ఎల్లప్పుడూ ముందు ఉండి నాయకత్వం వహిస్తున్నాను అలా నేను నా కొత్త-బంతి నైపుణ్యాలను నేర్చుకుంటున్నాను." కాగా 87 టీ20ల్లో హార్దిక్? 26.43 సగటుతో 69 వికెట్లు తీశాడు. 2018 ఆగస్టులో చివరిసారిగా టెస్ట్? మ్యాచ్? ఆడిన హార్దిక్, ఈ ఏడాది భారతదేశంలో జరగనున్న ప్రపంచ కప్?తో పాటు వచ్చే ఏడాది కరీబియన్‌లో జరిగే టీ20 ప్రపంచ కప్?కే తన ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపాడు."టెస్ట్-మ్యాచ్ క్రికెట్ ఆడటానికి ఇది సరైన సమయం అని నేను భావించినప్పుడు తిరిగి వస్తాను" అని హార్దిక్ చెప్పాడు.'అతని ఆటను చూసి నేనేం ఆశ్చర్యపోలేదు' న్ని ఫార్మాట్లల్లో దూసుకెళ్తున్న శుభ్?మన్? గిల్ ప్రతిభను హార్దిక్? మెచ్చుకున్నాడు?. "నాకు మొదటి నుంచే తెలుసు అతనికి అన్ని ఫార్మాట్లు ఆడే శక్తి సామర్థ్యాలున్నాయని.

# అంతర్జాతీయ క్రికెట్‌లో తనదైన ముద్ర



టీమిండియా ఓపెనర్ శుభ్‌మాన్ గిల్ మరో సెంచరీతో అదరగొట్టాడు. 23 ఏళ్ల ఈ యువ ఆటగాడు వరుస శతకాలతో అంతర్జాతీయ క్రికెట్‌లో తనదైన ముద్ర వేస్తున్నాడు. టెస్ట్‌ల్లో సెంచరీ.. ఆ తర్వాత వన్డేల్లో డబుల్ సెంచరీ.. ఇక ఇప్పుడు టీ20ల్లో మెరుపు శతకం.. టీమిండియాలో తన శకం మొదలైందంటూ గిల్ రికార్డులు సృష్టిస్తున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి, రెండో టీ20 మ్యాచ్‌ల్లో విఫలమైన శుభ్‌మన్ గిల్ సిరీస్‌లోని మూడో, ఆఖరి మ్యాచ్‌లో బౌలర్లను దంచికొట్టాడు. టీ20ల్లో తొలి శతకాన్ని నమోదు చేసి.. కేవలం 5 నెలల్లోనే విరాట్ కోహ్లీ రికార్డును బద్దలు కొట్టాడు. ఫిబ్రవరి 1న కివీస్‌తో జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లకు 4 వికెట్లు నష్టపోయి 234 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. గిల్ అద్భుత సెంచరీతో ప్రత్యర్థి బౌలర్లను ఓ ఆట ఆడేసుకున్నాడు. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ కేవలం 63 బంతుల్లో 126 పరుగులతో చివరి వరకు అజేయంగా నిలిచాడు. తన ఇన్నింగ్స్‌లో మొదటి 53 పరుగులు 35 బంతుల్లో గిల్ చేయగా.. ఆ తర్వాత గేర్ మార్చి 25 బంతుల్లో 73 పరుగులు బాదేశాడు. అలాగే బౌండరీల రూపంలో 12 ఫోర్లు, 7 సిక్సర్లు.. అంటే 19 బంతుల్లో 90 రన్స్ రాబట్టాడు. ఇక ఈ ఇన్నింగ్స్‌తో గిల్ కొన్ని ప్రత్యేక మైలురాళ్లను అందుకోవడమే కాదు.. కొన్ని రికార్డులను సైతం బద్దలు కొట్టాడు. మరి ఆ రికార్డులేంటో తెలుసుకుందామా.? మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు నమోదు చేసిన ఐదో భారత బ్యాట్స్‌మెన్‌గా శుభ్‌మన్ గిల్ చరిత్ర సృష్టించాడు. అంతకు ముందు ఈ ఘనతను సురేశ్ రైనా, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లీ సాధించారు.

కివీస్‌తో జరిగిన టీ20లో గిల్ కేవలం 63 బంతుల్లో 126 పరుగులు చేశాడు. ఇది ఈ ఫార్మాట్‌లో భారత బ్యాట్స్‌మెన్‌కు అత్యధిక వ్యక్తిగత స్కోర్. 5 నెలల క్రితం 2022, సెప్టెంబర్ 8న ఆఫ్ఘనిస్తాన్‌పై విరాట్ కోహ్లీ(122 నాటౌట్) నెలకొల్పిన రికార్డును గిల్ బద్దలు కొట్టాడు. అంతర్జాతీయ టీ20లో సెంచరీ చేసిన భారత యువ బ్యాట్స్‌మెన్‌గా శుభ్‌మన్ గిల్ రికార్డుల్లోకి ఎక్కాడు. గిల్ 23 ఏళ్ల 146 రోజుల వయసులో ఈ రికార్డు సృష్టించడం ద్వారా సురేశ్ రైనా (23 ఏళ్ల 156 రోజులు)ను అధిగమించాడు. న్యూజిలాండ్‌పై ఈ ఫార్మాట్‌లో అత్యధిక స్కోరు చేసిన ఆటగాడిగా గిల్ నిలిచాడు. గతంలో దక్షిణాఫ్రికాకు చెందిన రిచర్డ్ లెవీ (117 నాటౌట్) పేరిట ఉన్న రికార్డును అతడు బద్దలు కొట్టాడు. అలాగే కివీస్‌పై గత నెలలో జరిగిన వన్డేలో గిల్ డబుల్ సెంచరీతో వన్డేల్లో తన అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో గిల్‌కి ఇదే తొలి సెంచరీ. ఈ ఫార్మాట్‌లో భారత్ తరఫున శతక్కొట్టిన ఏడో బ్యాట్స్‌మెన్‌గా గిల్ నిలిచాడు. అతడి కంటే ముందు సురేశ్ రైనా, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, దీపక్ హుడా, సూర్యకుమార్




# హీరో ఎవరైనా ...మ్యూజిక్ అదరగొడుతున్న థమన్

హీరో ఎవరైతే నాకేంటి.. గూస్‌బంప్స్ తెప్పించే మ్యూజిక్‌తో అదరగొట్టడమే నా పని.. అంటూ సినిమా సినిమాకు అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు ఎస్ థమన్. సినిమాకు కథ ఒక ఎత్తు అయితే.. ఆ కథను సమర్థవంతంగా నడిపించడానికి బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కావాలి. కథకు సరిపోయే విధంగా మ్యూజిక్ అందిస్తూ సినిమాకు హైప్ క్రియేట్ చేయడంలో ఎప్పుడూ ముందుంటాడు ఎస్ థమన్. ఈ స్టార్ మ్యూజిక్ కంపోజర్ ప్రస్తుతం ఆర్‌సీ 15, ఎస్‌ఎస్‌ఎంబీ 28 ప్రాజెక్ట్‌లకు పనిచేస్తున్నాడు. కాగా మహేశ్‌బాబుతో థమన్ చేస్తున్న నాలుగో సినిమా ఎస్‌ఎస్‌ఎంబీ 28. దూకుడు, ఆగడు, సర్కారు వారి పాట తర్వాత ఎస్‌ఎస్‌ఎంబీ 28 చేస్తున్నాడు. మొత్తానికి ఈ సినిమాతో తన కల నెరవేరిందంటున్నాడు థమన్. ఎస్‌ఎస్‌ఎంబీ 28కు పనిచేయడం నాకున్న అతిపెద్ద కల.. ఆ కల నెరవేరుతున్న క్షణం ఇది. మహేష్ బాబు-త్రివిక్రమ్ శ్రీనివాస్ చేసే ప్రాజెక్ట్‌లో నేను ఎంతకాలం నుంచి ˇనిచేయాలనుకుంటున్నానో చెప్పలేను. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అతడు నా ఫేవరేట్ చిత్రాల్లో ఒకటి. మహశ్ బాబు సినిమా కోసం పూర్తిస్థాయిలో అవుట్ పుట్ స్తానని, ఈ సినిమా కోసం నా వర్క్ ఆకాశమే హద్దులా ఉండబోతుందని చెప్పాడు థమన్.




## శరవేగంగా హరిహరవీరమల్లు షూటింగ్



పవన్ కళ్యాణ్ కెరీర్‌లో ఫస్ట్ టైమ్ పీరియాడిక్ జానర్‌లో నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఆయన కెరీర్‌లో ఫస్ట్ పాన్ ఇండియా మూవీ కూడా ఇదే. క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఔరంగజేబుగా నటిస్తున్న బాబీడియోల్‌కు సంబంధించిన సీన్స్ అక్కడ షూట్ చేస్తున్నారట. ఇదిలాఉంటే సినిమాకు సంబంధించి మరో అప్‌డేట్ వినిపిస్తోంది. దీన్ని రెండు భాగాలుగా రిలీజ్ చేసేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారట. ఇటీవలే దర్శకుడు క్రిష్ ఈ ఐడియా చెప్పగా పవన్ కళ్యాణ్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి కీరవాణి సంగీతం అందిస్తు న్నారు. ఎ.ఎమ్.రత్నం, ఎ.దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. మరోవైపు సుజీత్ దర్శ కత్వంలో ఇటీవల ప్రారంభమైన పవన్ కళ్యాణ్ కొత్త సినిమా 'ఓజీ'ని కూడా రెండు భాగాలుగా తెరకెక్కించ బోతున్నట్టు వినిపిస్తోంది.

# చిత్రపరిశ్రమలో మరో విషాదం

## తెలుగు దర్శకుడు సాగర్ కన్నుమూత



చిత్రపరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. ఇటీవలే సీనియర్ నటి జమున మృతి చెందగా.. తాజాగా ప్రముఖ తెలుగు దర్శకుడు సాగర్ (70) గా పేరున్న విద్యాసాగర్ రెడ్డి కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. ఆరోగ్యం విషమించడంతో చెన్నైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. దర్శకుడు సాగర్ రాకాసి లోయ చిత్రంతో డైరెక్టర్‌గా తన సినీ కెరీర్ ను ప్రారంభించారు. అమ్మదొంగ, స్టూవర్టుపురం దొంగలు, రామసక్కనోడు, ఖైదీ బ్రదర్స్, అన్వేషణ లాంటి సినిమాలను సాగర్ తీశారు. సాగర్ మరణంతో చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. పలువురు సినీప్రముఖులు ఆయనకు సంతాపం ప్రకటిస్తున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన సాగర్ సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 'రాకాసి లోయ'తో మొదటిసారి దర్శకుడిగా అడుగులు వేశారు. తెలుగు సినిమా దర్శకుల సంఘానికి మూడుసార్లు అధ్యక్షుడిగా పనిచేశారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA, Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in